

# రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు విద్యార్థినులు ఎంపిక

**ఆలంపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణం ఎస్. జి. ఎఫ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి అండర్ 14,17 బాల బాలికల యోగా ఎంపిక పోటీలలో గద్వాల్ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థునులు సఫీన,

మిగతా 2 లో




జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





శుక్రవారం 09 అక్టోబర్ 2026 పేజీలు:16


# ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్ పరిశీలన

- ముంపు బాధితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి
- నిర్వాసితులకు మెరుగైన పునరావాస సౌకర్యాలు కల్పించే లక్ష్యంతోనే ప్రభుత్వం ఉంది
- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్







**నాగర్ కర్నూల్ అక్టోబర్ 8**

**(ప్రజా జ్యోతి బ్యూరో)**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్, నక్కలగండి రిజర్వాయర్ పనులను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మన్నెవారిపల్లి సమీపంలోని ఎస్ఎల్‌బీసీ అవుట్‌లెట్ టన్నెల్ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం నక్కలగండి రిజర్వాయర్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రాజెక్టు నిర్మాణ పురోగతి, ముంపు ప్రాంతాలు, భూసేకరణ, నిర్వాసితులపునరావాసం, పరిహారం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

మిగతా 2 లో

# రైతు సమస్యలు తెలుసుకోవాలంటే పొలం గట్టుకు రావాలి




- క్షేత్రస్థాయిలో అధికారులు విస్తృతంగా పర్యటించాలి : రైతు, వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- ఆధునిక సాగు, పంటల మార్పిడితో రైతులకు అధిక లాభాలు: ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి- వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ఎంపిక : కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో):**

రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని రైతు, వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సూచించారు.వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, పట్టుపరిశ్రమ తదితర శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, నేరుగా పొలాల్లో పర్యటించాలని అన్నారు.

మిగతా 2 లో



# బుల్లెట్ ట్రైన్ స్టేషన్..

## ఎలివేటెడ్ కారిడార్ స్థల పరిశీలన

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో)**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ స్టేషన్, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి గుర్తించిన ప్రభుత్వ స్థలాన్ని, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ,

మిగతా 2 లో

# ఎస్ఎల్బీసీ అవుట్లెట్ టన్నెల్ పరిశీలన

మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నక్కలగండి రిజర్వాయర్ ముంపు పరిధిలోని మర్లపాడు తండా, కేశతాండలోని రీ-లోకేటెడ్ ( ఆర్ అండ్ ఆర్ ) స్థలాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ పరిశీలించారు. పునరావాస ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ముంపునకు గురవుతున్న మర్లపాడు తండా గ్రామస్తులతో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే నేరుగా మాట్లాడి వారి సమస్యలనుతెలుసుకున్నారు. పునరావాసం, పరిహారం, భూములు, మౌలిక వసతులు తదితర అంశాలపై గ్రామస్తులు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., నక్కలగండి రిజర్వాయర్ ముంపు ప్రభావిత కుటుంబాలకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం, అవసరమైన మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ముంపు బాధితుల సమస్యలను అధికారులు క్షేత్రస్థాయిలో తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పునరావాస ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ... నక్కలగండి రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న కుటుంబాల ప్రయోజనాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు.నిర్వాసితులకు న్యాయబద్ధమైన పరిహారంతో పాటు, వారి భవిష్యత్ జీవనానికి ఉపయోగపడే విధంగా మెరుగైన పునరావాస సౌకర్యాలు కల్పించేలా చర్యలు ప్రభుత్వం జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.అదేవిధంగా ఎస్ఎల్బీసీ అవుట్లెట్ టన్నెల్, నక్కలగండి రిజర్వాయర్ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనులు ముందుకుసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత రైతాంగానికి, ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలు తెలుసుకోవాలంటే పొలం గట్టుకు రావాలి

మొదటిపేజీ తరువాయి

మహబూబ్నగర్ పట్టణంలోని అనంత మారుతి ఫంక్షన్ హాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కిసాన్ మేళాను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి కోదండరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ విప్, మహబూబ్నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ పరిశోధనా సంస్థలు, వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాల స్టాళ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ దేశానికి రైతే వెన్నెముక అని అన్నారు. కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో అధికారులు కార్యాలయాలు, యూట్లకే పరిమితం కాకుండా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటలకు బోనస్ వంటి కార్యక్రమాలు రైతులకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. పెరుగుతున్న పెట్టుబడి, కూలీల ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రైతులకు లాభదాయకమైన మద్దతు ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మహబూబ్నగర్ జిల్లాలో వరి, పత్తితో పాటు ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, పంటల మార్పిడిని ప్రోత్సహించాలని సూచించారు. కంది, సజ్జలు, జొన్నలు, వేరుశనగ వంటి పంటల సాగును తిరిగి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సంఘటితమైతే దళారుల దోపిడీని అరికట్టవచ్చని, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లను బలోపేతం చేసి రైతులు నేరుగా మార్కెట్ చేసుకునే అవకాశాలు కల్పించాలని సూచించారు.సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు సేంద్రియ పంటలకు ధ్రువీకరణ, ప్రత్యేక మార్కెట్ సదుపాయాలు కల్పించాలని అన్నారు. రైతులు పండించిన పంటలను విక్రయించేందుకు అవసరమైన చోట మార్కెట్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని, కల్తీ విత్తనాల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

**ఆధునిక సాగుతోనే రైతుకు భరోసా:**

ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్రెడ్డి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పంటలు సాగు చేసినప్పుడే వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, రుణమాఫీ వంటి కార్యక్రమాలతో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు.వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. వరి సాగుకే పరిమితం కాకుండా మార్కెట్లో డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటలు, చిరుధాన్యాలు, ఆయిల్పామ్ వంటి వాణిజ్య పంటలపై దృష్టి సారించాలన్నారు. ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ యంత్రాల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

**వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక:**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటలు సాగు చేయాలని అన్నారు. కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రైతులు సందర్శించి నూతన విత్తన రకాలు, ఆధునిక సాగు పద్ధతులు, డ్రోన్ల వినియోగం, లాభదాయకమైన పంటలపై అవగాహన పొందాలని సూచించారు. పంటల మార్పిడి, ప్రత్యామ్నాయ పంటలు, ఫామ్పాండ్లలో చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం పొందుతున్న రైతుల అనుభవాలను ఇతర రైతులతో పంచుకోవాలని తెలిపారు.వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో మమేకమై ప్రభుత్వ పథకాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతులు కిసాన్ మేళాలో శాస్త్రవేత్తలను సంప్రదించి పంటల ఎంపిక, తక్కువ నీటితో సాగు, వాతావరణానికి అనుకూలమైన విత్తన రకాలపై సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ స్టేషన్.. ఎలివేటెడ్ కారిడార్ స్థల పరిశీలన

మొదటిపేజీ తరువాయి

అచ్చంపేట సబ్కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి స్థలాన్ని సందర్శించి, ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ గురువారం క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతిపాదిత ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమి లభ్యత, స్థల పరిస్థితులు, రహదారి అనుసంధానం, మౌలిక వసతుల కల్పనకు ఉన్న అవకాశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. భూ రికార్డులు, సర్వే వివరాలు, స్థల సరిహద్దులను సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి స్పష్టమైన నివేదిక సమర్పించాలని ఆదేశించారు.ప్రాజెక్టు అమలుకు అవసరమైన భూ వివరాలను సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సకాలంలో సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్తులో చేపట్టే మౌలిక వసతుల ప్రాజెక్టులకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు, రహదారి అనుసంధానం, ప్రజలకు అవసరమైన ఇతర సదుపాయాలపై సమగ్రంగా అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, అచ్చంపేట నియోజకవర్గంలో బుల్లెట్ ట్రైన్ స్టేషన్, ఎలివేటెడ్ కారిడార్ వంటి కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు ఏర్పాటు కావడం నల్లమల అటవీ ప్రాంత పరిధిలోని ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే అచ్చంపేటతో పాటు పరిసర ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించే అవకాశం ఉందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఈ ప్రాంత ప్రజల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిపాదిత ప్రాజెక్టుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అచ్చంపేటనియోజకవర్గంలో అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సహకారంతో కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు విద్యార్థినులు ఎంపిక

మొదటిపేజీ తరువాయి

అసినా, ఈ నెల 11 తేదీ నుండి 13 వరకు సిద్దిపేట లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 17 యోగ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ భవాని ,వ్యాయామ ఉపాధ్యాయురాలు రాధ స్కూల్ స్టాఫ్ అభినం దించారు అలాగే ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థునులు రాష్ట్ర స్థాయి యోగ పోటీలో కూడా ప్రతిభ కనబరచాలని విజయాన్ని సాధించాలని ఆకాంశించారు.

# ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా పేరపాక దీపక్ బాధ్యతలు

## - పారదర్శకంగా, వేగవంతంగా రిజిస్ట్రేషన్ సేవలు అందించాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో ):**



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రిజిస్ట్రార్‌గా (ఆర్ వో) నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పేరపాక దీపక్ గురువారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన దీపక్‌కు కలెక్టర్ ఖుష్బూ గుప్తా అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లా రిజిస్ట్రార్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖాపరంగా సమన్వయంతో పనిచేస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సేవలను అందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# కులాంతర వివాహ దంపతులకు రూ.30 లక్షల చెక్కుల పంపిణీ చేసిన

## - ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు

**అలంపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో కులాంతర వివాహాలు చేసుకున్న 12 మంది లబ్ధిదారులకు రూ.30 లక్షల విలువైన చెక్కులను అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ.. కులాంతర వివాహాలు సమాజంలో కుల వివక్షను తగ్గించి, సమానత్వం మరియు సామాజిక ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు. కులాంతర వివాహం చేసుకున్న దంపతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కులాలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పరస్పర గౌరవంతో, ఐకమత్యంతో జీవించాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





# మాజీ సర్పంచ్ వెంకటన్న గౌడ్ కి నివాళులర్పించిన ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు

**ఆలంపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామ మాజీ సర్పంచ్ వెంకటన్న గౌడ్ అనారోగ్యంతో అకాల మరణం చెందారు.ఈ విషాద వార్త తెలుసుకున్న అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు స్వయంగా సాతర్ల గ్రామానికి చేరుకుని మాజీ సర్పంచ్ వెంకటన్న గౌడ్ భౌతికకాయానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనోధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# నితిన్ రాజు కుటుంబానికి బైక్ మెకానిక్ యూనియన్ అండ

**మల్దకల్ అక్టోబర్ 08(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి చెందిన నితిన్ రాజు అక్టోబర్ 6న అనుకోని పరిస్థితుల్లో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.బైక్ మెకానిక్‌గా వృత్తిని కొనసాగిస్తూ తన భవిష్యత్తును తీర్చిదిద్దుకునే ప్రయత్నంలో ఉన్న నితిన్ రాజు మృతి కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.ఈ నేపథ్యంలో నితిన్ రాజు కుటుంబానికి అండగా నిలిచేందుకు మల్దకల్ మండల బైక్ మెకానిక్ యూనియన్ సభ్యులు మానవత్వంతో ముందుకొచ్చారు.గురువారం తాటికుంట గ్రామానికి వెళ్లిన యూనియన్ సభ్యులు నితిన్ రాజు తల్లి,కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.ఈ కష్టకాలంలో కుటుంబానికి తామంతా అండగా ఉంటామని యూనియన్ సభ్యులు భరోసా ఇచ్చారు.నితిన్ రాజు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు.కష్ట సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన మల్దకల్ మండల బైక్ మెకానిక్ యూనియన్ సభ్యులందరికీ నితిన్ రాజు కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# మల్దకల్ వాసవి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

## - 11 నుంచి 20 వరకు ప్రత్యేక పూజలు,హోమాలు,అభిషేకాలు

**మల్దకల్ అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

ఆదిశిలా క్షేత్రం మల్దకల్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షులు మనసాని నాగరాజు,మండల అధ్యక్షులు ఇల్లూరి గంగాధర,గౌరవ అధ్యక్షులు ఇల్లూరి నాగరాజు,అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాదాం శ్రీనివాసులు,యువజన సంఘం అధ్యక్షులు గనేకల్ వీరేష్,అవోపా సంఘం అధ్యక్షులు నరహరి వెంకటేష్,మహిళా సంఘం అధ్యక్షురాలు బాదాం లక్ష్మీదేవమ్మ,కమిటీ సలహాదారులు తెలిపారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణలతో పూజలు, హోమాలు,అభిషేకాలు,అర్చనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ నెల 11న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో,12న శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో,13న శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారంలో,14న శ్రీ కాత్యాయనీ దేవి అలంకారంలో,15న శ్రీ లలితా దేవి అలంకారంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.అలాగే 16న శ్రీ ధనలక్ష్మీ దేవి,17న శ్రీ సరస్వతీ దేవి,18న శ్రీ దుర్గాదేవి,19న శ్రీ మహిషాసుర మర్దిని దేవి,20న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అలంకారాల్లో అమ్మవారిని భక్తులకు దర్శనమివ్వనున్నారు.నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేక హోమ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.పూజా కార్యక్రమాలు పెబ్బేరు చైతన్య ఆచార్యులు,జోషి రవి ఆచారి,ప్రద్యుమ్న ఆచారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఉత్సవాలకు వచ్చే భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.



# రైతులు, ప్రజల సమస్యలపై అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు ప్రత్యేక చర్చ

## - పీజేపీ ఎస్.ఈతో భేటీ.. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సమస్యలపై విజ్ఞప్తి

**అలంపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**



జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని పల్లెపాడు, ఆర్.గార్లపాడు, ధర్మవరం, చందూరు గ్రామాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు  అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.గురువారం గద్వాల్ జిల్లా కేంద్రంలో పీజేపీ.ఎస్ఈతో అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు ప్రత్యేకంగా భేటీ అయిఆయా గ్రామాలకు సకాలంలో సాగునీరు విడుదల చేయడం, కాలువల మరమ్మతులు చేపట్టడం వంటి అంశాలపై చర్చించారు.అలాగే గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, పనిచేయని బోర్లు, మోటార్లను వెంటనే మరమ్మతు చేసి ప్రజలకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగారైతులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సకాలంలో అందించడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను నివారించడం, రైతులకు సంబంధించిన విద్యుత్ సబ్సిడీ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే రైతులు, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు విజ్ఞప్తి చేయగా, పీజేపీ. ఎస్ఈ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో పల్లెపాడు శంకర్ రెడ్డి, సత్యా రెడ్డి, సర్పంచ్ రమేష్ మౌర్య, గోపాల్ రెడ్డి, విష్ణువర్ధన్ గౌడ్, జాల గురుస్వామి, టి. నాగేంద్రం, బోయ వెంకటస్వామి, కె. లక్ష్మినారాయణ, ధర్మవరం సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, ఆర్.గార్లపాడు సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి, ధర్మవరం రంగారెడ్డి తదితర రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ తనిఖీ

## - విద్యార్థులకు అందుతున్న భోజనం, విద్యాబోధన, మౌలిక వసతులపై ఆరా

## - సిద్దాపూర్ గ్రామ శివారులో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థల పరిశీలించిన

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 8**

**(ప్రజా జ్యోతి బ్యూరో)**





నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని సిద్దాపూర్ గ్రామంలో గురువారం ప్రభుత్వ బాలుర గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అచ్చం పేట సబ్ కలెక్టర్ సలోని ఛాబ్రాతో కలిసి పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, ఉపా ధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను వరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ సకాలంలో భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయంపై అధికారులు ఆరా తీశారు.విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, భోజన ఏర్పాట్లు, పాఠశాలలో అమలవుతున్న నిర్వహణ విధానాల గురించి సంబంధిత సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండటం వారి ఆరోగ్యం, విద్యాభ్యాసానికి ఎంతో ముఖ్యమని ఈ తనిఖీ ప్రాధాన్యతను తెలియజేసింది.అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను ఏ విధంగా బోధిస్తున్నారనే విషయాన్ని పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన స్థాయి, తరగతుల నిర్వహణ, బోధనకు సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలలో విద్యను సక్రమంగా అభ్యసించేందుకు అనుకూలమైన వాతావరణం ఉందా అనే అంశాన్ని పరిశీలించారు.పాఠశాలకు కొంతమంది విద్యార్థులు తరచుగా గైర్హాజరవుతున్నట్లు గుర్తించిన అధికారులు, అందుకు గల కారణాలను సంబంధిఉపాధ్యాయులతో పాటు తోటి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల గైర్హాజరుకు గల కారణాలను గుర్తించడం ద్వారా వారి చదువుకు ఆటంకం కలగకుండా చూడాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువులో రాణించేలాఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాల్సిన ప్రాధాన్యతను గుర్తించారు.పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతుల గురించి కలెక్టర్, ఎమ్మెల్యే నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అందుబాటులో ఉన్న సదు పాయాలు, రోజువారీ అవసరాలు, విద్యాభ్యాసానికి సంబంధించిన అంశాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడం ద్వారా పాఠశాల నిర్వహణలో ఉన్న అంశాలను సమీక్షించేందుకు అధికారుల( పయత్నించారు.పాఠశాల తనిఖీ అనంతరం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, సబ్ కలెక్టర్ సలోని ఛాబ్రా సిద్దాపూర్ గ్రామ శివారులో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు క్రీడా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రాంగణం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.క్రీడా ప్రాంగణం ఏర్పాటు ద్వారా గ్రామీణ యువతకు వ్యాయామం, క్రీడల్లో పాల్గొనేందుకు అవసరమైన వసతులు కల్పించే అవకాశం ఉంటుంది. యువత శారీరక దృఢత్వాన్ని పెంపొందించు కోవడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకునేందుకు ఇలాంటి సదుపాయాలు ఉపయోగపడతాయని తెలిపారు. సిద్దాపూర్ గ్రామంలో ఒకవైపు గిరిజన ఆశ్రమ పాఠశాల పనితీరును పరిశీలించడంతో పాటు, మరోవైపు తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థల పరిశీలన చేపట్టడం ద్వారా విద్య, క్రీడలకు సంబంధించిన అంశాలపై అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, యువతకు క్రీడా సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకమైన అంశాలుగా నిలుస్తాయి.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రసాయన భారానికి సహజ సాగుతో ఊరట

## - పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులకు ప్రత్యామ్నాయం..

## - నేల ఆరోగ్యానికి రక్షణ- క్యాపిటల్ ఇన్ఫర్మేషన్

వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్

పంట పండించాలంటే ముందుగా పెట్టుబడి పెట్టాల్సిందే. విత్తనం నుంచి ఎరువుల వరకు, పురుగుమందుల నుంచి కూలీల వరకు ఖర్చులు ఏటా పెరుగుతున్నాయి. ముఖ్యంగా రసాయన ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగడంతో రైతుపై పెట్టుబడి భారం మరింత పెరుగుతోంది. మరోవైపు రసాయనాల విచ్చలవిడి వినియోగం నేల ఆరోగ్యం, నీటి వనరులు, పర్యావరణంపై ప్రభావం చూపుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రకృతితో



మమేకమై సాగు చేసే సహజ వ్యవసాయం వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

### ప్రకృతిని నమ్ముకుని సాగు

సహజ వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడకుండా స్థానికంగా లభించే ప్రకృతి వనరులతో పంటలు సాగు చేస్తారు. పశువుల ఆధారిత వనరులు, పంట అవశేషాలు, మొక్కల ఆకులు, ఇతర స్థానిక పదార్థాలను వినియోగించుకోవడం ఇందులో కీలకం. రైతు పొలంలోనే అందుబాటులో ఉండే వనరులను వినియోగించుకోవడం ద్వారా బయట నుంచి కొనుగోలు చేసే ఇన్‌పుట్లపై ఆధారపడటాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చు.

### నేల ఆరోగ్యమే అసలు సంపద

ఏ పంటకైనా నేలే ఆధారం. నేల ఆరోగ్యం దెబ్బతింటే దీర్ఘకాలంలో పంటల సాగుపై ప్రభావం పడే అవకాశం ఉంది. సహజ వ్యవసాయ పద్ధతులతో నేలలో సేంద్రియ పదార్థం, సూక్ష్మజీవుల కార్యకలాపాలు మెరుగుపడే అవకాశం ఉంటుంది. నేల తేమను నిలుపుకునే సామర్థ్యం పెరగడంతో నీటి వినియోగాన్ని కూడా కొంతవరకు తగ్గించుకోవచ్చు. మిత్ర కీటకాలు, సూక్ష్మజీవులు, ఇతర జీవులకు అనుకూల పరిస్థితులు ఏర్పడటంతో జీవవైవిధ్య పరిరక్షణకు దోహదపడుతుంది.












### విత్తనం నుంచి పురుగుల నియంత్రణ వరకు

సహజ వ్యవసాయంలో బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం వంటి సహజ తయారీలన









# పాలమూరు-రంగారెడ్డి డీపీఆర్‌ను మూడోసారి వెనక్కి పంపడం దురదృష్టకరం

- 90 టీఎంసీలపై స్పష్టత లేదనడం కుంటిసాకు
- వారం రోజుల్లో నార్లాపూర్ పంపులు ఆన్ చేయకపోతే రైతులతో కలిసి అక్కడే కూర్చుంటాంమాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్ / మహబూబ్ నగర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో ):** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను కేంద్రం మూడోసారి వెనక్కి పంపడంపై మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రశ్నించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు ప్రధానమైన అడ్డంకులు 2023 ఆగస్టు 10 నాటికే తొలగిపోయాయని, అయితే ఒక చిన్న సంతకం పెండింగ్‌లో పడిందని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. అనంతరం ఎన్నికలు జరిగి కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆమోద ప్రక్రియలో జాప్యం జరిగిందని ఆరోపించారు.

### 90 టీఎంసీలపై స్పష్టత లేదనడం సరికాదు

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు 90 టీఎంసీల నీటి అంశంపై స్పష్టత లేదంటూ డీపీఆర్‌ను వెనక్కి పంపడాన్ని శ్రీనివాస్ గౌడ్ తప్పుబట్టారు. 45 టీఎంసీల నీటి కేటాయింపుకు సంబంధించి 1980లో బచావత్ ట్రిబ్యునల్‌లోనే స్పష్టత ఉందని ఆయన పేర్కొన్నారు.నాగార్జునసాగర్ ఎగువ ప్రాంతంలో తెలంగాణకు 45 టీఎంసీల నీటిని వినియోగించుకునే హక్కు ఉందని ఆయన అన్నారు. నిజాం కాలం అనంతరం ధ్వంసమైన చెరువుల కారణంగా ఏర్పడిన మైనర్ ఇరిగేషన్ నష్టాన్ని పూడ్చేందుకు మరో 45 టీఎంసీల కేటాయింపు అంశం ఉందని, ఈ రెండింటినీ కలిపి 90 టీఎంసీలుగా పేర్కొంటున్నామని వివరించారు.

### బనకచర్ల అంశాన్ని ప్రస్తావించిన మాజీ మంత్రి

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్ వెనక్కి వెళ్లడానికి బనకచర్ల అంశం కూడా కారణమని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కేంద్ర జల సంఘం, జలశక్తి శాఖకు సంబంధించిన నిర్ణయాలపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక వివరణ రావాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు.

### “పాలమూరు ప్రజల బతుకు ఏమవుతుంది.?”

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా సుమారు 12.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం ఉన్న నేపథ్యంలో డీపీఆర్ మూడోసారి వెనక్కి పంపడం ఆందోళన కలిగిస్తోందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు.ఇప్పటికే ప్రాజెక్టులో 60 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లు నిర్మించామని ఆయన పేర్కొన్నారు. కృష్ణా బేసిన్ నుంచి ఇతర ప్రాంతాలకు నీటిని తరలించే పరిస్థితుల్లో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న పాలమూరుకు సాగునీరు అందకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు.

### నార్లాపూర్ పంపులపై డెడ్‌లైన్

నార్లాపూర్ పంపులను వెంటనే ఆన్ చేసి కరివెన వరకు అన్ని రిజర్వాయర్లను నింపాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. వారం రోజుల్లో నార్లాపూర్ పంపులు ఆన్ చేయకపోతే రైతులతో కలిసి అక్కడే కూర్చుంటామని ఆయన ప్రకటించారు. పాలమూరులో పంటలు ఎండిపోతే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. కర్ణాటక నుంచి తెలంగాణకు అందుతాయని చెప్పిన నీటి విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.




### “పాలమూరు రైతులకు నీటి భరోసా కల్పించాలి”

కల్వకుర్తి పంపులను కూడా పూర్తిస్థాయిలో ఆన్ చేయడం లేదని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు నీటి భరోసా కల్పించాలని కోరారు.పాలమూరులో ఎండిపోయిన పంటలను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కనీసం హెలికాప్టర్‌లో అయినా పరిశీలించాలని ఆయన డిమాండ్ చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు అంశంపై పాలమూరు ప్రాంత ఎంపీలు కేంద్రంపై ఎంత మేర ఒత్తిడి తెస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ప్రాజెక్టు అనుమతులు, నీటి కేటాయింపులు, డీపీఆర్‌పై ఉన్న అభ్యంతరాలను పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. చంద్రబాబు పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు అడ్డుపడవద్దని ఆయన కోరారు. పాలమూరు ప్రజల సాగునీటి హక్కులను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకు రావాలని డిమాండ్ చేశారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం పాలమూరుకు దురదృష్టకరంగా మారిందని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. రైతులు కడుపుమండి ఆందోళనలు చేస్తే కేసులు పెట్టడం సరికాదని అన్నారు.పాలమూరు ప్రాజెక్టుపై ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావు గతంలో చేసిన వ్యాఖ్యలను కూడా శ్రీనివాస్ గౌడ్ ప్రస్తావించారు. గతంలో ప్రాజెక్టును ప్రశంసించిన నాయకులు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తమ వైఖరి మార్చుకున్నారా అని ప్రశ్నించారు.

### “ప్రజలు అన్నీ గమనిస్తున్నారు”

పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో ప్రజలు, రైతులు అన్నీ గమనిస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పాలమూరు ప్రయోజనాలకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వాలను కోరారు.పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులు, నీటి కేటాయింపులు, డీపీఆర్ అభ్యంతరాలను వెంటనే పరిష్కరించి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య ప్రత్యేక పూజలు: ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు

## భక్తులందరికీ అన్నప్రసాదం..

**ధరూర్ అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి ప్రతినిధి):** జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 15వ,శతాబ్దంలో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 15న అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు.అమావాస్య సందర్భంగా బ్రహ్మముహూర్తంలో స్వామివారికి పంచామృత అభిషేకం,ఆకు పూజలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామివారిని దర్శించుకునే భక్తులందరికీ పెద్ద చింతరేవుల అన్నప్రసాద ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వామివారి అన్నప్రసాదాన్ని ప్రతి భక్తుడు తప్పనిసరిగా స్వీకరించాలని కేశవాచార్యులు కోరారు.అభిషేక పూజలు,ఆకు పూజలకు సంబంధించిన వివరాల కోసం 9959251123నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అమావాస్య ప్రత్యేక పూజలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.





# ఓటీపీ చెప్పారంటే... ఖాతా ఖాళీ అయినట్టే!

## - సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు.. డిజిటల్ లావాదేవీల్లో అప్రమత్తతే రక్షణ

## - మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలి

## - ఎస్‌బీఐ ఏజీఎం పవన్ కుమార్

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో):**

డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ రీజినల్ బిజినెస్ ఆఫీస్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పవన్ కుమార్ సూచించారు. ముందస్తు అవగాహన, అప్రమత్తతతో పాటు మోసం జరిగిన వెంటనే స్పందించడమే సైబర్ నేరాల నుంచి రక్షణకు ప్రధాన మార్గమని ఆయన అన్నారు. మహబూబ్‌నగర్ మిని ట్యాంక్ బండ్ వద్ద ఎస్‌బీఐ రీజినల్ బిజినెస్ ఆఫీస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన "ఫ్రాడ్ & సైబర్ క్రైమ్ అవేర్‌నెస్" కార్యక్రమంలో పవన్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.

### ఒక్క క్లిక్‌తో మోసం జరిగే ప్రమాదం:

ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త మార్గాలను ఎంచుకుంటున్నారని బ్యాంకు అధికారులు తెలిపారు. ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఓటీపీ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ కేవైసీ కాల్స్, యూపీఐ మోసాలు, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు, రిమోట్ యాక్సెస్ యాప్‌లు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లు వంటి వాటి ద్వారా ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో వివరించారు.

### ఓటీపీ, పిన్, సివివి ఎవరికీ చెప్పొద్దు

బ్యాంకు ఖాతాదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఓటీపీ, పిన్, సివివి పాస్‌వర్డ్ లేదా ఇతర రహస్య బ్యాంకింగ్ వివరాలను ఇతరులతో పంచుకోవద్దని అధికారులు హెచ్చరించారు. బ్యాంకు అధికారులు, ప్రభుత్వ సంస్థల పేరుతో ఫోన్ చేసి రహస్య వివరాలు అడిగినా స్పందించవద్దని సూచించారు."మీ ఖాతా బ్లాక్ అవుతుంది... కే వై సి అప్‌డేట్ చేయాలి... మీకు రివార్డు వచ్చింది... మీ అకౌంట్‌లో సమస్య ఉంది..." అంటూ వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను వెల్లడించవద్దని తెలిపారు.

### తెలియని లింకులు క్లిక్ చేయొద్దు

అపరిచిత వ్యక్తులు పంపే లింకులపై క్లిక్ చేయడం, వారు సూచించిన అనుమానాస్పద మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. అలాగే నకిలీ కస్టమర్ కేర్ నంబర్ల విషయంలో కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా బ్యాంకింగ్ సేవ కోసం సంబంధిత సంస్థ యొక్క అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక యాప్‌లో ఉన్న వివరాలను మాత్రమే ఉపయోగించాలని కోరారు.

### క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే ముందు ఆలోచించండి!

క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డబ్బు వస్తుందని కొందరు సైబర్ నేరగాళ్లు ప్రజలను నమ్మిస్తున్నారని అధికారులు తెలిపారు. డబ్బు పంపడానికి మాత్రమే కొన్ని సందర్భాల్లో క్యూఆర్ కోడ్ ఉపయోగపడుతుందని, డబ్బు పొందడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం ఉందనే వాదనలను నమ్మవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు.

### మోసం జరిగితే ఆలస్యం చేయొద్దు

సైబర్ మోసానికి ఎవరైనా గురైతే భయపడి ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించాలని ఎస్‌బీఐ అధికారులు సూచించారు. వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని



తెలిపారు. అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే సంబంధిత లావాదేవీలను నిలిపివేసే అవకాశం ఉండొచ్చని, అందువల్ల "తర్వాత చూద్దాం" అనే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

### ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యం

డిజిటల్ బ్యాంకింగ్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సురక్షితంగా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించేలా అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ సీఎమ్ (కాంప్లైయన్స్) కోదండరామ్, సీఎమ్ (ఎస్ఎంఈ బ్రాంచ్) కిరణ్, సీఎమ్ (రాజేంద్రనగర్ బ్రాంచ్) అల్తాఫ్ హుస్సేన్‌తో పాటు వివిధ ఎస్‌బీఐ శాఖల అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పోలీస్‌మీడియా సమన్వయం కీలకం

## - నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):**

ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పోలీస్‌మీడియా సమన్వయం కీలకం అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని శాసన్‌పల్లి రోడ్‌లో గల లక్ష్మి బ్యాంకెట్ హాల్‌లో గురువారం జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్, ప్రెస్ గెట్ టు గెదర్ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖతో పాటు ప్రజలకు సేవలందించడంలో మీడియా కూడా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్తంభంగా, వాచ్‌డాగ్‌గా పనిచేస్తూ ప్రభుత్వ శాఖలు, అధికారులు ప్రజలకు అందించాల్సిన సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ప్రజల దృష్టికి తీసుకువెళ్తుందని పేర్కొన్నారు.పోలీసులు, మీడియా మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఎంతో అవసరమన్నారు. పోలీసు శాఖలో రోజువారీ విధుల్లో ఎదురయ్యే సమస్యలు, లోపాలను మీడియా నిర్మాణాత్మకంగా సూచించడం ద్వారా వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.



ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని, ఇందుకు మీడియా సహకారం అవసరమన్నారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంపొందించడంలో మీడియా పాత్ర ముఖ్యమైనదని ఎస్పీ అన్నారు. పోలీసులపై ప్రజలకు విశ్వాసం ఉన్నప్పుడే నేరాల నియంత్రణతో పాటు సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావడంలో ప్రజలు ముందుకు వస్తారని తెలిపారు. పోలీసుప్రజల మధ్య విశ్వాసం, సత్సంబంధాలను పెంపొందించేందుకు మీడియా వారధిగా పనిచేస్తోందన్నారు. కరోనా సమయంలో పోలీసులతో పాటు వైద్యులు, మీడియా ప్రతినిధులు ప్రజలకు సేవలందించేందుకు ముందుండి పనిచేశారని ఎస్పీ గుర్తుచేశారు. మీడియా సేవలను కూడా అత్యవసర సేవల్లో భాగంగా గుర్తించిన పరిస్థితులను ఆయన ప్రస్తావించారు. నారాయణపేట జిల్లాలో గత ఏడాది కాలంగా పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమాలు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు సిబ్బంది చేసిన కృషిని ఆయన అభినందించారు. జిల్లా పోలీసు శాఖలోని ప్రతి అధికారి, సిబ్బంది రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని తెలిపారు. పోలీసు శాఖ విజయాలు ఏ ఒక్కరి కృషి ఫలితం కాదని, ప్రతి ఒక్కరి సమష్టి కృషితోనే సాధ్యమవుతాయని పేర్కొన్నారు.పోలీసు శాఖకు మీడియా అందిస్తున్న సహకారానికి ఎస్పీ డాక్టర్ వినీత్ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లోనూ ఇదే విధమైన సహకారం, సమన్వయంతో పనిచేస్తూ నారాయణపేట జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కలిసి ముందుకు సాగుదామని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేశ్, డీ పీ ఆర్ వో రషీద్, వివిధ జర్నలిస్టు సంఘాల సభ్యులు, ప్రింట్/ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ,ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యాలను పెద్దగా నిర్దేశించుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

## -ఒక్కరి ప్రయాణం భిన్నమే.. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

## - నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):**

విద్యార్థులు లక్ష్యాలను పెద్దగా నిర్దేశించుకుని నైపుణ్యాలను పెంపొందించు కోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని చిట్టెం నర్సిరెడ్డి స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు, సిబ్బందికి ముందుగా దసరా, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల విద్యార్థులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కళాశాల రోజులను గుర్తు చేసుకోవడం ద్వారా ఎంతో నాస్టాల్జిక్‌గా అనిపిస్తోందని, విద్యార్థి దశలో స్నేహితులతో కలిసి గడిపిన సమయం జీవితంలో ఎంతో విలువైనదని పేర్కొన్నారు. కళాశాల జీవితం కేవలం చదువుకు మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, నైపుణ్యాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు తమ గురించి తాము తెలుసుకునే ప్రయత్నం చేయాలని, తమకు ఏ రంగంపై ఆసక్తి ఉంది, ఏ రంగంలో నైపుణ్యం ఉందో గుర్తించి ఆ దిశగా కృషి చేయాలని అన్నారు. ప్రాబ్లమ్ సాల్వింగ్, కమ్యూనికేషన్, పబ్లిక్ స్పీకింగ్ వంటి నైపుణ్యాలను కళాశాల దశలోనే పెంపొందించు కోవాలని సూచించారు. ఈ రెండు, మూడు సంవత్సరాల కళాశాల జీవితం భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకునే సమయమని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.విద్యార్థులు తమ లక్ష్యాలను చిన్నవిగా నిర్దేశించుకోకుండా పెద్దగా కలలు కనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సివిల్ సర్వీసెస్, యూపీఎస్సీ, వైద్య, చార్టర్డ్ అకౌంటెన్సీ, సైన్స్ తదితర రంగాల్లో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. ఒకే కళాశాలలో, ఒకే తరగతి గదిలో చదువుతున్న విద్యార్థుల్లో భవిష్యత్తులో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలను చేరుకునే వారు ఉంటారని, ఎవరి భవిష్యత్తు ఎలా



ఉండాలన్నది వారు తీసుకునే నిర్ణయాలు, పెంపొందించుకునే నైపుణ్యాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరి జీవన ప్రయాణం భిన్నంగా ఉంటుందని, ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దని సూచించారు. కొంతమంది త్వరగా విజయాన్ని సాధిస్తే, మరికొందరు కొంత ఆలస్యంగా విజయాన్ని అందుకోవచ్చని, సమయం ఏదైనా లక్ష్య సాధన కోసం నిరంతరం కృషి చేయడం ముఖ్యమని అన్నారు. వివాహం, కుటుంబ బాధ్యతల అనంతరం కూడా పోటీ పరీక్షలు రాసి ఉన్నత ఉద్యోగాలు సాధించిన అనేక మంది ఉన్నారని పేర్కొన్నారు.ప్రస్తుతం సాంకేతికత అందుబాటులో ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమాచారం, అవకాశాలను తెలుసుకునే అవకాశం విద్యార్థులకు ఉందని కలెక్టర్ అన్నారు. అవకాశాలు లేవని భావించకుండా, అందుబాటులో ఉన్న అవకాశాలను గుర్తించి వాటిని సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తులను గుర్తించడంతో పాటు కొత్త విషయాలను నేర్చుకోవాలని, తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని అన్నారు. ఆత్మవిశ్వాసమే విజయానికి కీలకమని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా



ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థులు కళాశాల జీవితాన్ని ఆనందంగా గడుపుతూనే ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ, క్రమశిక్షణతో చదువుకోవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని, దానిలో ప్రతిభను నిరూపించుకునేలా కృషి చేయాలని, ప్రతి ఒక్కరూ ఉన్నత విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం కళాశాల లెక్చరర్లు, విద్యార్థినులతో కలిసి కలెక్టర్ బతుకమ్మ ఆటలాడి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మంజుల, కళాశాల ప్రిన్సిపల్ మెర్సీ వసంత, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హౌస్ సర్జన్ వైద్యులకు సమాన పారితోషకం ఇవ్వాలి

## - వైద్యుల పట్ల తారతమ్యాలు వద్దు

## - జిల్లా ఆసుపత్రి వైద్యుల నిరసన




**నాగర్ కర్నూల్ : అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి)**

జాతీయ మెడికల్ కౌన్సిల్ సూచించిన విధంగానే ఇంటర్ షిప్ కాలంలో ప్రతి గ్రాడ్యుయేట్ వైద్యునికి స్టైఫెండ్ పారితోషికాన్ని చెల్లించాలని ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. సాయి శశాంక్,జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కార్తీక్ చంద, కార్యదర్శి డాక్టర్. నితిన్ రెడ్డి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఇండియన్ మెడికల్ గ్రాడ్యుయేట్ లకు చెల్లిస్తున్న పారితోషకాన్ని సమాన స్థాయిలో పనిచేస్తున్న ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ కు సమాన స్టైఫండ్ అందజేయాలని గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2026 జనవరి నుండి నేటి వరకు ప్రభుత్వంనుండి ఎలాంటి స్టైఫండ్ స్వీకరించలేదని,పస్తులతో విధులు నిర్వహిస్తున్నామనిసమాన వైద్యసేవలకు సమాన పారితోషికం 29 వేల 792 రూపాయలిచ్చి సరైన న్యాయం కల్పించి,వెంటనే పారితోషికం నిధులు విడుదల చేసి ఆదుకోవాలన్నారు.ఆసుపత్రులలో క్యాజువాలిటీ,ఇంటెన్సిస్ కేర్ యూనిట్,వివిధ విభాగాల ఓపి సేవలను 24 గంటల పాటు అందిస్తున్నామని అన్నారు.ప్రజ లకు సేవ చేస్తున్నా ప్రభుత్వం పారితోషికం ఇవ్వకపోవడం నిర్లక్ష్య వైఖరికి దర్పణంలా కనిపిస్తుందని ప్రభుత్వం వైద్యులపట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నారు.మొదటి మూడు రోజులు ఓ.పి సేవలు ఇంటెన్సీవ్ సేవలు ఆపుదల చేస్తామనిన్నారు.న్యాయపరమైన విషయాన్ని ప్రభుత్వం గమనించి వెంటనే స్టైఫెండ్ విడుదల చేయాలని సమస్య. పరిష్కారంకాకపోతే ఆరోగ్య సేవలు పూర్తిస్థాయిలో ఆపదల చేస్తామని,రాష్ట్ర వైద్య సంచాలకుల కార్యాలయం ముందు భారీఎత్తున నిరసన చేయుటకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటెన్సివ్ వైద్యులు డాక్టర్లు సమీర్,హిమాని,అక్షిత,నవీన్,ఉన్నతి,నయుం,జైపాల్ రెడ్డి,ప్రేమిక,ఫిలిప్స్,అమన్,సంతోష్,శివాని,నికిత,తదితరులు పాల్గొన్నారు.

# నేరాలపై ఉక్కుపాదం..

# ప్రజల భద్రతకు పటిష్ట పోలీసింగ్

- ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు.. బాధితులకు సత్వర న్యాయం
- బీట్, పెట్రోలింగ్ బలోపేతం.. ప్రజలకు కనిపించేలా విజిబుల్ పోలీసింగ్
- దేవి నవరాత్రులకు పటిష్ట భద్రత.. సైబర్, రోడ్డు ప్రమాదాలపై విస్తృత అవగాహన
- గంజాయి, మట్కా, జూదం, అక్రమ రవాణాపై కఠిన చర్యలు
- మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అధికారులకు కీలక ఆదేశాలు

**ఆలంపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీ.ఎస్ జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, బీట్ సిస్టమ్, పెట్రోలింగ్ సి సి .టి. ఎన్.ఎస్ ట్రాఫిక్ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా, బాధితులకు సత్వర న్యాయం అందేలా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా దర్యాప్తులో జాప్యం, విధుల్లో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. అలాగే నేరం జరిగిన తర్వాత స్పందించడమే కాకుండా.. నేరం జరగకుండా ముందే అడ్డుకోవడమే లక్ష్యంగా పోలీసింగ్ ఉండాలని ఎస్పీ సూచించారు. ప్రతి గ్రామం, కాలనీలో బీట్ సిస్టమ్‌ను మరింత పటిష్టం చేసి స్థానిక సమస్యలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు, అసాంఘిక కార్యకలాపాలపై ముందస్తు సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. అదేవిధంగా బీట్ సిబ్బంది ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహిస్తూ ప్రజలకు పోలీసుల ఉనికి స్పష్టంగా కనిపించేలా విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని ఆదేశించారు. సీ.సీ టి.ఎన్.ఎస్ పనితీరుపై సమీక్షిస్తూ పోలీస్ స్టేషన్లలో ఎలాంటి పనులు పెండింగ్‌లో ఉండకూడదని, కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని తెలిపారు. అదేవిధంగా లాంగ్ పెండింగ్ కేసులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించి, దొంగిలించబడిన సొత్తును రికవరీ చేసి బాధితులకు అందించాలని ఆదేశించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అదే విధంగా గంజాయి, మట్కా, జూదం, ఇసుక అక్రమ రవాణా, పి.డి.ఎస్ రైస్ అక్రమ తరలింపు వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రానున్న దేవి నవరాత్రుల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి మండపం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని, మండపాలు, నిమజ్జన కార్యక్రమాలు, ట్రాఫిక్, ప్రజల రాకపోకలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సంబంధిత శాఖలు, మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుని ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగామహిళలు, చిన్నారుల భద్రతకు




ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ చైల్డ్ అండ్ ఉమెన్ సేఫ్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. అలాగే ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేస్తూ ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీ.ఎస్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, డీఎస్పీ గద్వాల వై. మొగిలయ్య, సీఐలు, ఎస్సైలు, జిల్లా పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- ఆరోగ్యం, సమతుల ఆహారం, పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి: డా. ఏ. శ్రీనివాసులు

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో):**







విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు సూచించారు. మహబూబ్‌నగర్‌లోని ట్రిబుల్ ఐ టి ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు విద్యార్థుల కోసం, ముఖ్యంగా బాలికల కోసం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించిన డా. శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఆరోగ్యం, సమతుల ఆహారం ఎంతో కీలకమని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో పాటు ప్రతిరోజూ శారీరక వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వివరించారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. చదువులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని, తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని అన్నారు. అలాగే ఉపాధ్యాయులను గౌరవిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. ప్రత్యేకంగా బాలికలు తమ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండటం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, సమతుల ఆహారం తీసుకోవడం వంటి అంశాలపై శ్రద్ధ పెట్టాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఐ ఓ డా. శైలజ, డా. పులి విద్య, డా. నరేష్ చంద్ర, డా. గౌతమి, లక్ష్మీ ప్రియాంకతో పాటు వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖ సేవల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలి

## -ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా పనితీరును సమీక్షించి ర్యాంకింగ్ ఇవ్వాలి

## - నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):**

జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు తదితర అంశాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పనితీరు, పురోగతిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మెడికల్ ఆఫీసర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పరిమిత వనరులు, సిబ్బంది కొరత వంటి సమస్యలు ఉన్నప్పటికీ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. అయితే వైద్య సేవలతో పాటు శాఖకు సంబంధించిన అన్ని సూచికలు, గణాంకాల్లో కూడా నిరంతరం పురోగతి సాధించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల అందుబాటు, సిబ్బంది హాజరు, ప్రజలకు అందిస్తున్న సేవలు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి అధికారి, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

"నివారణ చికిత్స కంటే మేలు" అనే సూత్రానికి అనుగుణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య మహిళతో పాటు ఇతర నివారణాత్మక ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. అంటువ్యాధుల నియంత్రణ, ముందస్తు గుర్తింపు, ప్రజల్లో ఆరోగ్య అవగాహన వంటి అంశాలపై మరింతగా దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన ఏవైనా లోటుపాట్లు, సమస్యలు ఉంటే వాటిని గుర్తించి పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సహకరిస్తుందని కలెక్టర్ తెలిపారు. అదే స్థాయిలో అధికారులు, సిబ్బంది కూడా పూర్తి నిబద్ధతతో పనిచేయాలని కోరారు.ప్రతి నెల మొదటి వారంలో




నిర్వహించే సమీక్షా సమావేశంలో గత నెలలో చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతి, ఇంకా సాధించాల్సిన లక్ష్యాలపై స్పష్టమైన నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా అన్ని అంశాల్లో పనితీరును పాయింట్ల ఆధారంగా విశ్లేషించి ర్యాంకింగ్ ఇవ్వాలని సూచించారు.గతంలో జిల్లాల వారీగా పనితీరును వివిధ పారామీటర్ల ఆధారంగా ర్యాంకింగ్ చేసిన విధానాన్ని అనుసరించి, జిల్లాలోని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరును కూడా వివిధ సూచికల ఆధారంగా అంచనా వేసి ర్యాంకింగ్ రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. తద్వారా మెరుగైన పనితీరు కనబరుస్తున్న కేంద్రాలను గుర్తించడంతో పాటు, వెనుకబడిన కేంద్రాల్లో అవసరమైన చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతి సమీక్షా సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా పనితీరు, పురోగతి, లోటుపాట్లు, మెరుగుదల కోసం తీసుకున్న చర్యలపై సమగ్రంగా సమీక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. అంతకుముందు సమావేశంలో జిల్లాలోని పీ హెచ్ సీల వారీగా సాధారణ, సిజేరియన్ ప్రసవాల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తలసేమియా కేసుల పరిస్థితిపై ఆరా తీశారు. గత మూడు నెలల ఆరోగ్య మహిళా స్క్రీనింగ్ వివరాలను సమీక్షించి, మద్దూరులో ప్రత్యేక ప్రణాళిక రూపొందించి సెర్ప్ సిబ్బంది సమన్వయంతో



మహిళలందరికీ స్క్రీనింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి సంబంధించిన స్క్రీనింగ్ నివేదిక సిద్ధం చేసి, మహిళలను మరింతగా మొబిలైజ్ చేయాలని సూచించారు. ఇమ్యూనైజేషన్, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాలపై సమీక్షిస్తూ ప్రజాప్రతినిధుల సమన్వయంతో శిబిరాలు నిర్వహించి శతశాతం కవరేజీ సాధించాలని ఆదేశించారు. ఆర్‌బీఎస్‌కే శిబిరాల ద్వారా గుర్తించిన ఎనీమియా, క్రిటికల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, అన్ని పాఠశాలల్లో శిబిరాలు పూర్తి చేయాలని సూచించారు.ఎన్‌సీడీ, హైపర్‌టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ స్క్రీనింగ్, ఎన్‌టీఈపీ, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమాల పురోగతిని సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా నివారణకు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఫైలేరియా బాధితులకు అవసరమైన చికిత్స అందుతున్నదీ లేదీ పరిశీలించాలని ఆదేశించారు. వచ్చే నెల సమీక్ష సమావేశానికి అన్ని కార్యక్రమాలకు సంబంధించిన పూర్తి వివరాలు, నివేదికలతో హాజరు కావాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సిద్ధప్ప, డీపీవో బిక్షపతి, మెడికల్ ఆఫీసర్లు, వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వేములలో ప్రభుత్వ సంస్థలపై మండల ప్రత్యేక అధికారి తనిఖీలు

## - పాఠశాలలు, అంగన్‌వాడీ, పల్లె దవాఖానాలో సేవలపై ఆరా

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 (పజా జ్యోతి బ్యూరో):**

మూసాపేట మండలం వేముల గ్రామంలో ప్రభుత్వ సంస్థల్లో అందుతున్న సేవలు, సిబ్బంది పనితీరు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను మండల ప్రత్యేక అధికారి గంప శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన సిబ్బంది హాజరు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యాలయ నిర్వహణ తీరుతో పాటు ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలోని వివిధ ప్రభుత్వ సంస్థలను పరిశీలించారు. ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సౌకర్యార్థం చేతులు కడుక్కునేందుకు ట్యాపులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నట్లు గుర్తించారు.

### అంగన్‌వాడీ కేంద్రంలో ఆహారం పరిశీలన

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ప్రత్యేక అధికారి చిన్నారులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. తనిఖీ సమయంలో చిన్నారులు నిద్రలో ఉండటాన్ని గమనించారు. కేంద్రంలో అందుతున్న సేవలు, సౌకర్యాలపై సంబంధిత సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### పల్లె దవాఖానాలో వైద్య సేవలపై ఆరా!

పల్లె దవాఖానాను సందర్శించి సిబ్బంది హాజరు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. తనిఖీ సమయంలో వైద్యాధికారి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. రోగులతో నేరుగా మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వైద్య సేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు.

### అదనపు తరగతి గదులు, గ్రంథాలయం అవసరం



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కూడా ప్రత్యేక అధికారి పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, కంప్యూటర్ గది, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో అదనంగా మూడు తరగతి గదులు, గ్రంథాలయం, భోజనశాల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం, పల్లె దవాఖానాలో ప్రజలకు, విద్యార్థులకు అందుతున్న సేవలపై సంబంధిత సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులతో ప్రత్యేక అధికారి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులు సూచించారు.

# ప్రాధాన్యతా రంగాలకు రుణాల పంపిణీ వేగవంతం చేయాలి

## - ప్రభుత్వ పథకాల రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: డీఆర్ఓ ఎ. నిర్మల

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో):**

జిల్లాలో వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, విద్య, గృహ నిర్మాణం తదితర ప్రాధాన్యతా రంగాలకు బ్యాంకులు విస్తృతంగా రుణాలు అందించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల సూచించారు. ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ద్వారా అర్హులైన వారికి రుణాలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె బ్యాంకర్లను ఆదేశించారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూన్ 2026తో ముగిసిన మొదటి త్రైమాసిక జిల్లా స్థాయి బ్యాంకర్ల సలహా సమితి సమీక్షా సమావేశం గురువారం డీఆర్ఓ ఎ. నిర్మల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 2026-27 వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన, వ్యవసాయం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, విద్య, గృహ రుణాలు తదితర ప్రాధాన్యతా రంగాలకు అందిస్తున్న రుణాల పురోగతిని సమీక్షించారు. జిల్లాలో రుణాలు, బ్యాంకు డిపాజిట్ల మధ్య నిష్పత్తిపై కూడా సమీక్ష నిర్వహించారు. రాబోయే త్రైమాసికంలో వ్యవసాయ మౌలిక సదుపాయాల రుణాలు, రైతు క్రెడిట్ కార్డు ద్వారా మత్స్య రంగ రుణాలు, ప్రధానమంత్రి స్వనిధి, వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల అభివృద్ధి పథకం వంటి ప్రభుత్వ పథకాల రుణాల అమలును వేగవంతం చేయాలని డీఆర్ఓ సూచించారు. ముఖ్యంగా ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల అభివృద్ధి పథకంపై ప్రత్యేక దృష్టి సారించి, పెండింగ్‌లో ఉన్న వినియోగ ధ్రువీకరణ పత్రాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**యువతకు రుణ అనుసంధానాల ద్వారా ఉపాధి:**

దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు రుణ అనుసంధానాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నాబార్డు, జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా చేపట్టిన 'గ్రామోదయం' కార్యక్రమం గురించి నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి వివరించారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న డ్రైవింగ్ శిక్షణకు అర్హులైన అభ్యర్థులను గుర్తించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌కు సూచించారు.

**చెంచు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి:**

హన్వాడ మండలంలోని చెంచు తెగ ప్రజలకు తక్కువ వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని గిరిజన అభివృద్ధి అధికారిని డీఆర్ఓ ఆదేశించారు.

**అక్టోబర్ 21 నుంచి ఆర్థిక చేరిక ప్రత్యేక ప్రచారం:**

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో అక్టోబర్ 21, 2026 నుంచి డిసెంబర్ 31, 2026 వరకు 'ఆర్థిక చేరిక ప్రత్యేక ప్రచారం' నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచారం ద్వారా బ్యాంకు ఖాతాలకు సంబంధించిన గుర్తింపు ధ్రువీకరణ, పునఃగుర్తింపు ధ్రువీకరణ, నామినీ నమోదు, సామాజిక భద్రతా పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించనున్నారు.ప్రతి బ్యాంకు ఖాతాకు నామినీ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని, సామాజిక భద్రతా పథకాల కింద వచ్చే క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో



డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులను నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం చంద్రశేఖర్, రిజర్వ్ బ్యాంక్ జిల్లా అధికారి జి. శ్రీకాంత్, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి మహేందర్ బాబు, ఎస్‌బీఐ ముఖ్య నిర్వాహకుడు మహ్మద్ జాఫర్, యూబీఐ ముఖ్య నిర్వాహకుడు రాజేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి. నర్సింహులు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.డి. యూసుఫ్, జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రధాన నిర్వాహకురాలు ఎం. శ్రీలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సిహెచ్. సంతోష్ కుమార్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పి. విష్ణువర్ధన్, గిరిజన అభివృద్ధి అధికారి చత్రు నాయక్, ఆర్‌సెటి డైరెక్టర్ పి. ప్రభాకర్‌తో పాటు వివిధ బ్యాంకుల నోడల్ మేనేజర్లు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# క్షయరహిత భారత్ లక్ష్యంగా గ్రామాల్లో విస్తృత అవగాహన

## - మహబూబ్‌నగర్ జిల్లాలో 22 గ్రామాల ఎంపిక..

## 4 గ్రామాలకు స్వర్ణ, 8 గ్రామాలకు రజత పురస్కారాలు

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 (ప్రజా జ్యోతి బ్యూరో):**

క్షయవ్యాధి (టీబీ) నిర్మూలన లక్ష్యంగా గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో పూర్తి చికిత్స అందించాలని వైద్యాధికారులు సూచించారు. క్షయరహిత భారత్ లక్ష్యంగా జోష్ సంస్థ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా క్షయ వ్యాధి కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ మల్లికార్జున్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**22 గ్రామాల ఎంపిక.. 12 గ్రామాలకు పురస్కారాలు:**

క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 22 గ్రామాలను ఎంపిక చేశారు. వీటిలో మెరుగైన ఫలితాలు సాధించిన గ్రామాలను గుర్తించి క్షయరహిత భారత్ పురస్కారాలు, ధ్రువపత్రాలను అందజేశారు.అత్యుత్తమ పనితీరు కనబరిచిన నాలుగు గ్రామాలకు స్వర్ణ పురస్కారాలు అందగా, మరో ఎనిమిది గ్రామాలకు రజత పురస్కారాలు అందజేశారు.

**స్వర్ణ పురస్కారాలు పొందిన గ్రామాలు:**

1. నవాబ్‌పేట మండలం మోడల్ పురుషంపల్లి
2. హన్వాడ మండలం మైనోనిపల్లి
3. దేవరకద్ర మండలం గడ్డగూడెం
4. జడ్చర్ల మండలం వల్లూరు

ఈ గ్రామాల సర్పంచులు స్వర్ణ పురస్కారాలతో పాటు క్షయరహిత భారత్ ధ్రువపత్రాలను స్వీకరించారు.క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో మెరుగైన పనితీరు కనబరిచిన మరో ఎనిమిది గ్రామాలకు రజత పురస్కారాలు, ధ్రువపత్రాలు అందజేశారు. ఆయా గ్రామాల సర్పంచులు పురస్కారాలను స్వీకరించారు.

**రెండు వారాలకు మించి దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయొద్దు:**

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రివేళల్లో చెమటలు పట్టడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, కఫంలో రక్తం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి క్షయవ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.క్షయవ్యాధి నయం చేయగల వ్యాధి అని, వైద్యుల సూచనల మేరకు మందులను క్రమం తప్పకుండా తీసుకుంటూ పూర్తి చికిత్స పొందితే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు. క్షయవ్యాధి బాధితుల పట్ల వివక్ష చూపకుండా కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు అండగా నిలవాలని కోరారు.

**క్షయరహిత భారత్ మనందరి బాధ్యత:**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో క్షయవ్యాధిపై అవగాహన పెంచడం, అనుమానితులను గుర్తించడం, సకాలంలో పరీక్షలు నిర్వహించడం, వ్యాధి




నిర్ధారణ అయిన వారికి పూర్తి చికిత్స అందేలా చూడటం ద్వారా క్షయరహిత భారత్ లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు."క్షయవ్యాధిని దాచవద్దు.. నిర్లక్ష్యం చేయవద్దు. లక్షణాలు ఉంటే పరీక్ష చేయించుకోండి.. పూర్తి చికిత్స పొందండి.. క్షయరహిత భారత్‌లో భాగస్వాములు కండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పురస్కారాలు పొందిన గ్రామాల సర్పంచులు వెంకటయ్య, నర్సింహులు, మంగమ్మ, లావుడ్య రంగోలి తదితరులకు పురస్కారాలు, ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడలు, యువజన అధికారి కోటారెడ్డి, డాక్టర్ ప్రీతి, జిల్లా క్షయవ్యాధి విభాగం సిబ్బంది గోపాలకృష్ణ, బాలరాజు, సత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కళ్లను ప్రేమించండి చూపును కాపాడుకోండి!

## - ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అవగాహన ర్యాలీ

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 ( ప్రజా జ్యోతి బ్యూరో):**

"మీ కళ్లను ప్రేమించండి మీ చూపును కాపాడుకోండి" అనే సందేశంతో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గురువారం అవగాహన ర్యాలీ, కంటి ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా మాట్లాడుతూ కంటి ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చూపు సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవసరమైన సమయంలో సరైన వైద్యం పొందడం ద్వారా అనేక కంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు.

### స్క్రీన్ టైమ్‌పై అప్రమత్తత అవసరం

ప్రస్తుత కాలంలో పిల్లలు, విద్యార్థులు మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టీవీలను ఎక్కువగా ఉపయోగిస్తున్న నేపథ్యంలో స్క్రీన్ టైమ్‌ను నియంత్రించాలని వైద్యులు సూచించారు. తగిన వెలుతురులో చదవడం, మధ్య మధ్యలో కళ్లకు విశ్రాంతి ఇవ్వడం, కంటి ఆరోగ్యానికి అవసరమైన పోషకాహారం తీసుకోవడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని తెలిపారు. కళ్లలో తరచూ మంట, నీరు కారడం, తలనొప్పి, దూరంలోని వస్తువులు స్పష్టంగా కనిపించక పోవడం, చదివేటప్పుడు అక్షరాలు సరిగ్గా కనిపించకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచించారు. "చూపు తగ్గిన తర్వాత చికిత్స కోసం ఎదురుచూడటం కంటేడ సమస్యను ముందుగానే గుర్తించడం ఎంతో ముఖ్యం" అని వారు పేర్కొన్నారు.

### స్వయంగా కంటి చుక్కలు వాడొద్దు

కంటి వైద్య విభాగం అధిపతి డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ కళ్లకు ఇబ్బంది కలిగినప్పుడు వైద్యుల సలహా లేకుండా స్వయంగా మందులు, కంటి చుక్కలు ఉపయోగించవద్దని సూచించారు. పిల్లలకు క్రమం తప్పకుండా దృష్టి పరీక్షలు చేయించాలని, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలు ఉన్నవారు కంటి పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. మొబైల్, కంప్యూటర్ వినియోగ సమయంలో కళ్లకు మధ్య మధ్యలో విశ్రాంతి ఇవ్వాలని సూచించారు. అలాగే కంటికి గాయం కావడం లేదా అకస్మాత్తుగా చూపు తగ్గడం వంటి పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం పొందాలని చెప్పారు. వృద్ధుల్లో చూపు సమస్యలను కేవలం వయస్సు ప్రభావంగా భావించకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

### ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేద్దాం:

ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ కంటి




ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కుటుంబ సభ్యుల కంటి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని వైద్యులు పిలుపునిచ్చారు."నా కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుకుంటానుడ నా కుటుంబ సభ్యుల కంటి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతానుడ అవసరమైనప్పుడు కంటి పరీక్ష చేయించుకుంటానుడ ఇతరులకు కూడా కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తాను" అంటూ ప్రతిజ్ఞ చేయాలని సూచించారు. "చూపు ఉంటేనే ప్రపంచం అందంగా కనిపిస్తుందిడ చూపును కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీత, డాక్టర్ రాజేశ్వరి, కంటి వైద్య విభాగం సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

---

# మారమునగాల లేదా ప్రాగటూరు వద్ద లిఫ్ట్ ఏర్పాటుతో ఉండవెల్లి, అల్లంపూర్ మండలాల వారికి 30 వేల ఎకరాలకు జీవనాడి

## వరద నీరు వచ్చినప్పటికీ రైతు కంట కన్నీరు

**ఆలంపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

కృష్ణా, తుంగభద్ర నదుల మధ్యలో ఉన్నాయి. ఒక పక్క 5 కి.మీ. లో కృష్ణా నది, ఇంకో పక్క 10 కి.మీ. లో తుంగభద్ర. చుట్టూ సముద్రమంత నీరు ఉన్నా, మా గొంతు ఎండిపోతోంది. సామెత చెప్పినట్టు "సముద్రంలో నీరు ఉన్నా తాగడానికి పనికిరానట్టు" మా పరిస్థితి ఉంది. 1రాజోలిబండ డైవర్షన్ స్కీం ఆర్. డి .ఎస్ కింద మనకు 15.9 టీ.ఎంసీ ల నీరు,85,000 ఎకరాల ఆయకట్టు రావాలి. కానీ లెక్కల ప్రకారం మనకు 5 టీ.ఎంసీ కంటే ఎక్కువ ఏనాడూ రాలేదు. దీనివల్ల 40-50 వేల ఎకరాలు కూడా సాగు కావడం లేదు. 2, తుమ్మిళ్ల లిఫ్ట్ తప్పుడు ప్రదేశంలోతుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ఉండాల్సిన చోట లేకుండా, కొందరి ఒత్తిడితో తప్పుడు చోట పెట్టడం వల్ల కాలువ పొడవు పెరిగి, చివరి ఆయకట్టు అయిన ఉండవెల్లి, మానవపాడు, అల్లంపూర్ మండలాలకు నీరు అందడం లేదు. 3, జూరాల వివక్ష జూరాల లెఫ్ట్ కెనాల్ ద్వారా ఆత్మకూర్, కొల్లాపూర్ వరకు 150 కి.మీ. నీరు పారుతుంది. కానీ జూరాల రైట్ కెనాల్ నుండి మన ఉండవెల్లి గ్రామాలకు కేవలం 45 కి.మీ. దూరం ఉన్నా నీరు రావడం లేదు. ఇది శోచనీయం. 4, ముంపు గ్రామాలకు అన్యాయం శాలిపురం, షేర్ పల్లి, మారమునగాల-1, మారమునగాల-2, ప్రాగటూరు గ్రామాలు శ్రీశైలం బ్యాక్ వాటర్ లో మునిగిపోయి భూములు కోల్పోయాయి. భూమి ఇచ్చిన మాకే సాగునీరు లేకపోవడం దారుణం.

### (పరిష్కారం ఒక్కటే మారమునగాల లిఫ్ట్ తప్పనిసరి)

కృష్ణా నది బ్యాక్ వాటర్ దగ్గర ఉన్న మారమునగాల లేదా ప్రాగటూరు గ్రామం వద్ద ఎత్తిపోతల పథకం లిఫ్ట్ ఏర్పాటు చేసి, దాన్ని నేరుగా ఆర్. డి .ఎస్ 32-వా లేదా ఆర్ .డి .ఎస్ 34 డిస్ట్రిబ్యూటరీకి అనుసంధానం చేయాలి.

### (దీనివల్ల జరిగే మేలు:)

ఈ ఒక్క లిఫ్ట్ తో పాత ఆర్ డి. ఎస్ కాలువకు జీవం వస్తుంది. నీరు ఈ క్రింది గ్రామాలకు పారుతుంది. ఉండవెల్లి మండలం మారమునగాల-1, మారమునగాల-2, ప్రాగటూరు, షేర్ పల్లి (సేరిపల్లె), తక్కశిల, ఖానాపురం, కంచుపాడు, ఉండవెల్లి, చిన్న ఆముదాల, పుల్లూరు, కలుగొట్ల, మెన్నిపాడు-

### (అల్లంపూర్ మండలం చివరి ఆయకట్టు)

లింగన్వాయి, క్యాతూరు, బైరాపురం, బసాపురం, ఇమ్మాపురం, సింగవరం వరకు ఫలితం: రెండు మండలాలు కలిపి దాదాపు 25,000 నుండి 30,000 ఎకరాలు సస్యశ్యామలం అవుతాయి.

### (మా రైతులుడిమాండ్ )

1. వెంటనే మారమునగాల లేదా ప్రాగటూరు వద్ద లిఫ్ట్ ఏర్పాటుకు ప్రభుత్వం డి పి .ఆర్ తయారు చేయాలి. 2. ఇది తాగునీరు, సాగునీరు రెండింటికీ ఉపయోగపడేలా డిజైన్ చేయాలి. 3. జూరాల రైట్ కెనాల్ నుండి రావాల్సిన వాటా నీటిని విడుదల చేయాలి. కావున ప్రభుత్వం, జిల్లా, తాలూకా నాయకులు రైతాంగం ఆవేదనను అర్థం చేసుకుని, మారమునగాల లిఫ్టును మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు



(ఉండవెల్లి, అల్లంపూర్ మండలాల రైతు ఐక్యవేదిక)

శేషన్ గౌడ్, మాజీ సర్పంచ్, గొంగల ఈశ్వర్ సర్పంచ్ సింగవరం, మారుమూల సర్పంచ్ సురేష్ గౌడ్, షేర్ పల్లి సర్పంచ్ ఎల్ల గౌడ్, పాములు అంజనేయులు, వెంకటేశ్వర్‌రెడ్డి, గొందిమల్ల సూరి కంచుపాడు రైతు సంఘం, సుంకన్న తక్కశిల రైతు సంఘం, వెంకటేష్ గౌడ్ పాగటూరు రైతు సంఘం, నరేందర్ రెడ్డి, అద్దాకుల రాజు చిన్నందలపాడు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిలోని ప్రతిభను వెలికితీయాలి

## - ప్రతి పాఠశాలలో 2030 మంది ప్రతిభావంతులను గుర్తించాలి
## - ఏఐ, ట్యాబ్‌లతో విద్యార్థుల అభిరుచులు, లక్ష్యాల డిజిటల్ నమోదు
## - పదేళ్లపాటు కొనసాగనున్న 'విద్యా యజ్ఞం': ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి









**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8 (సాక్ష్యం బ్యూరో):**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న సహజ ప్రతిభను గుర్తించి, వారి అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత విద్యా వాలంటీర్లపై ఉందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో విద్యా వాలంటీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, నగర మేయర్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 మంది విద్యా వాలంటీర్లకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున గౌరవ వేతనం అందజేశారు.

**విద్యార్థులకు మెంటర్లుగా నిలవాలి:**
కేవలం పాఠాలు బోధించడంతో తమ బాధ్యత పూర్తయిందని భావించకుండా విద్యార్థులకు మార్గదర్శకులు, మెంటర్లుగా విద్యా వాలంటీర్లు నిలవాలని యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహబూబ్‌నగర్‌లో అమలు చేస్తున్న విద్యా వాలంటీర్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కూడా విస్తరించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్‌ను కార్యక్రమానికి ఆహ్వానించినట్లు తెలిపారు. ఇతర జిల్లాల కలెక్టర్లకు కూడా ఈ కార్యక్రమం గురించి వివరించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి విద్యా కార్యక్రమాలను విస్తరించేలా కృషి చేయాలని కోరారు.విద్యా వాలంటీర్లకు అందుతున్న గౌరవ వేతనం కేవలం ఆర్థిక ప్రోత్సాహకం మాత్రమే కాదని, విద్యార్థుల భవిష్యత్తుకు సేవ చేసే అవకాశం లభించిందనే స్ఫూర్తితో పనిచేయాలని అన్నారు.

**ప్రతి పాఠశాలలో 2030 మంది ప్రతిభావంతుల గుర్తింపు**
ప్రతి పాఠశాలలో కనీసం 20 నుంచి 30 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారి ఆసక్తులు, అభిరుచులు, నైపుణ్యాలు, భవిష్యత్తు లక్ష్యాలను తెలుసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులతో కొంత సమయం గడిపి వారు ఏ రంగంలో రాణించగలరో గుర్తించి వివరాలను నమోదు చేయాలని అన్నారు. ప్రతిభ ఉన్న ఏ ఒక్క విద్యార్థి కూడా సరైన ప్రోత్సాహం లేక వెనుకబడకూడదని స్పష్టం చేశారు. ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి అండగా నిలిచి, వారి కలలను సాకారం చేసుకునే దిశగా చేయూతనివ్వడమే విద్యా వాలంటీర్ వ్యవస్థ ప్రధాన లక్ష్యమన్నారు.

**ఏఐతో విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాల డిజిటల్ నమోదు:**
రాబోయే రోజుల్లో విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కార్యక్రమాన్ని రూపొందించనున్నట్లు యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ట్యాబ్‌ల ద్వారా విద్యార్థుల అభిరుచులు, ఆలోచనలు, లక్ష్యాలు, భవిష్యత్తులో ఏమి కావాలనుకుంటున్నారనే అంశాలను ప్రశ్నావళి రూపంలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి వివరాలను డిజిటల్‌గా భద్రపరిస్తే భవిష్యత్తులో వారికి అవసరమైన సమయంలో ఉన్నత విద్య, కెరీర్ మార్గదర్శకత్వం, ఇతర సహాయాన్ని అందించేందుకు వీలవుతుందని వివరించారు.

**పదేళ్లపాటు 'విద్యా యజ్ఞం':**
విద్యా వాలంటీర్లు నెలకు ఒకసారి పాఠశాలకు వెళ్లి బాధ్యతను పూర్తి చేసే సాధారణ కార్యక్రమంగా కాకుండా, నిర్దిష్ట లక్ష్యంతో ప్రారంభించిన దీర్ఘకాలిక 'విద్యా యజ్ఞం'గా దీనిని ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రాబోయే పది సంవత్సరాల పాటు కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తూ, మహబూబ్‌నగర్‌లోని ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి నాణ్యమైన విద్య, సరైన మార్గదర్శకత్వం, ప్రతిభకు తగిన ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు.

**మహిళలకు 2,500 మందికి శిక్షణ:**
మహబూబ్‌నగర్ ఫస్ట్ ద్వారా గత ఏడాది కాలంగా మహిళలకు వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, ఆరు బ్యాచ్‌లలో సుమారు 2,500 మందికి శిక్షణ అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. శిక్షణ సమయంలో మహిళల్లో కనిపించిన పట్టుదల, బాధ్యత తీసుకుని పనిచేసే సామర్థ్యం, ఆలోచనా విధానం తమకు విశ్వాసాన్ని కలిగించాయని అన్నారు. మహిళలకు బాధ్యత అప్పగించి, తగిన ప్రోత్సాహం అందిస్తే మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకంతోనే విస్తృతమైన విద్యా వాలంటీర్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.

**విద్యా వాలంటీర్ల సేవలు అభినందనీయం: కలెక్టర్**
జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ విద్యా వాలంటీర్లకు గౌరవ వేతనం అందించడం సంతోషకరమైన విషయమన్నారు.పిల్లలను పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా 'బియాండ్ ది బుక్స్' వైపు తీసుకెళ్లేందుకు వాలంటీర్లు చేస్తున్న కృషిని అభినందించారు. కార్డులు, డిజిటల్ ట్యాబ్‌లు తదితర ఆధునిక బోధనా పద్ధతులను ఉపయోగిస్తూ విద్యార్థులు విషయాలను సులభంగా, ఆచరణాత్మకంగా నేర్చుకునేలా చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమన్నారు. వాలంటీర్ల సేవలతో విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెరుగుతున్నాయని పేర్కొన్నారు.గౌరవ వేతనం అందుకున్న ఈరోజు అనుభూతిని స్ఫూర్తిగా తీసుకుని, పిల్లల భవిష్యత్తు కోసం మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు సాధించి, ఉన్నత విద్యను అభ్యసించి మంచి కళాశాలలకు వెళ్లే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బోధనలో ఎదురయ్యే ఆచరణాత్మక సమస్యలను వాలంటీర్లు పరస్పరం చర్చించుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు పాఠాలు అర్థం కాకపోవడం, తరగతిలో ఆసక్తి చూపకపోవడం వంటి సమస్యలు ఎదురైతే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను సంప్రదించి వారి సూచనలు తీసుకోవాలని తెలిపారు.విద్యార్థులు, తల్లిదండ్రులతో ఎదురయ్యే పరిస్థితులపై వాలంటీర్లు తమ అనుభవాలను పరస్పరం పంచుకుంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమానికి ఆహ్వానించిన ఎమ్మెల్యేకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యా వాలంటీర్లందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ రవీందర్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఫస్ట్ ఇంచార్జీ నిజలింగప్ప తదితరులు పాల్గొన్నారు.



# లబ్ధిదారులకు ఎల్.ఓసి పత్రాలను అందజేసిన ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు

**ఆలంపూర్ అక్టోబర్ 8(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**
జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం లో అయిజ మండలం లో ఉప్పల్ గ్రామానికి చెందిన నాయకి రామకృష్ణ కు 6 లక్షల రూపాయల, మరియు మానవపాడు మండలం పెద్ద పోతులపాడు గ్రామానికి చెందిన శైలజ కుమారికి 5 లక్షల రూపాయల విలువైన ఎల్ .ఓ .సి పత్రాలను లబ్ధిదారులకు అందించిన ఆలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యుడు విజయుడు ,ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాలెం ప్రభుత్వ కళాశాలలో జాతీయ స్థాయి వర్క్‌షాప్ విజయవంతం

## - నకిలీ పెట్టుబడి యాప్‌లతో జాగ్రత్త - ప్రిన్సిపాల్ డా.పి.రాములు

**నాగర్ కర్నూల్ : అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి)**

పాలెం లోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో బీ.ఎఫ్.ఎస్.ఐ కెరీర్స్ బ్యాంకింగ్ మరియు ఆర్థిక రంగ భవిష్యత్‌కు "నైపుణ్యాల అభివృద్ధి" అనే అంశంపై ఒకరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను గురువారం విజయవంతంగా నిర్వహించారు.కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో,అంతర్గత నాణ్యతా హామీ విభాగం(ఐక్యూఏసీ)సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాలమూరు యూనివర్సిటీ వాణిజ్య శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా.కె.రాజ్ కుమార్ పాల్గొని బ్యాంకింగ్,ఆర్థిక సేవలు,బీమా రంగాల్లో "కెరీర్ అవకాశాలు"అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించి బ్యాంకింగ్,ఆర్థిక సేవలు,బీమా రంగాల్లో ఉన్న వివిధ ఉద్యోగ అవకాశాలు,కెరీర్ మార్గాలు,భవిష్యత్ అవకాశాల గురించి వివరిస్తూ,విద్యార్థులు తమ ఆసక్తి,సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్‌ను ఎంచుకోవడతోపాటు పరిశ్రమఅవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు.అనంతరం పాలమూరు యూనివర్సిటీ వాణిజ్య శాస్త్ర విభాగం అధిపతి డా.ఎం. అనురాధ రెడ్డి భవిష్యత్‌కు సిద్ధమైన బీ.ఎఫ్.ఎస్.ఐ నిపుణుడికి అవసరమైన నైపుణ్యాలఅనే అంశంపై ప్రసంగిస్తూ ఉద్యోగ రంగంలో రాణించేందుకు కమ్యూనికేషన్ నైపుణ్యాలు,డిజిటల్ పరిజ్ఞానం,విశ్లేషణాత్మక ఆలోచన సాంకేతిక నైపుణ్యాలు,సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ మరియు కన్వీనర్ డా.పి.రాములు అధ్యక్షతవహించి విద్యార్థులకు ఆర్థిక అవగాహనపై సూచనలు చేసి స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా డబ్బు సంపాదించే అవకాశాలను ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించి పెట్టుబడులలో లాభాలతో పాటు నష్టాలు కూడా సంభవించే అవకాశం ఉందని ప్రస్తుతం పెరుగుతున్న నకిలీ పెట్టుబడి యాప్‌లు,మోసపూరిత డబ్బు సంపాదించే యాప్‌ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని,అధిక లాభాలు వస్తాయని నమ్మించి ప్రజలను మోసంచేసే నకిలీ



యాప్‌ల ద్వారా డబ్బునష్టపోయే ప్రమాదముందన్నారు. ఏదైనా పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ, యాప్ లేదా పెట్టుబడి వేదిక విశ్వసనీయతను పరిశీలించాలని,పూర్తి అవగాహనతో ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు పి.రాములు,వి. శ్రీనివాసులు,శివ దొడ్ల, కె. సుష్మ,పద్మజ,నాగరాజు,నీలి కవిత,మహమ్మద్ అక్బర్,కావలి కురుమయ్య,వెంకటేష్,నాగలింగం,కె. రాధా కుమారి,కె.స్వప్న,ఎం.మహేశ్వర్ జీ, గోపాసి ప్రకాష్ బాబు,రాథ్లావత్ స్వర్ణలత, ఎం. రాములు, రాఘవేంద్ర చారి,శ్యామ్ సుందర్, బొంతల అఖిల, ప్రవలిత,అమరావాది మనోజ్ కుమార్ లతోపాటు ధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# పంచ్‌లతో హోరెత్తిన పాలమూరు.. జేపీఎన్సీలో జాతీయ బాక్సింగ్ పోటీలు ప్రారంభం

## - క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తే ముఖ్యం : ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

## - యువత క్రీడల్లో రాణించాలి: ఎంపీ డీకే అరుణ

## - 24 రాష్ట్రాల నుంచి 250 మంది బాక్సర్లు





**మహబూబ్‌నగర్ అక్టోబర్ 08 ( ప్రజా జ్యోతి బ్యూరో)**

పాలమూరు గడ్డపై జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల సందడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని జేపీఎన్సీ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కలిసి పోటీలను ప్రారంభించారు.దేశంలోని 24 రాష్ట్రాల నుంచి 250 మంది బాక్సర్లు ఈ పోటీలకు హాజరై తమ ప్రతిభను చాటేందుకు సిద్ధమయ్యారు.

### క్రీడా స్ఫూర్తే ముఖ్యం: యెన్నం

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించడమే అత్యంత ముఖ్యమని అన్నారు. బాక్సింగ్ ఎంతో కఠినమైన క్రీడ అని, శారీరక దారుఢ్యంతో పాటు అపారమైన మానసిక స్థైర్యం, క్రమశిక్షణ అవసరమని పేర్కొన్నారు. క్రీడాకారులు ఓటమిని కూడా ఒక పాఠంగా తీసుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తూ క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్న 250 మంది బాక్సర్లు తమ ప్రతిభను చాటుకుని భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. పోటీల నిర్వాహకులకు, క్రీడాకారులకు యెన్నం శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### యువత క్రీడల్లో రాణించాలి: డీకే అరుణ

ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ గడ్డపై ఇలాంటి ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలు జరగడం శుభపరిణామమని అన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి టోర్నమెంట్ల ద్వారా స్థానిక యువతకు క్రీడలపై ఆసక్తి పెరగడంతో పాటు, జాతీయ స్థాయి క్రీడాకారుల ప్రతిభను ప్రత్యక్షంగా చూసే అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.మహబూబ్‌నగర్ యువత ఈ అవకాశాన్ని స్ఫూర్తిగా తీసుకుని క్రీడల్లో రాణించాలని ఆమె పిలుపునిచ్చారు.

### జాతీయ పతాక ఆవిష్కరణ.. రింగ్‌లో పంచ్‌లతో ప్రారంభం

పోటీల ప్రారంభానికి ముందు అతిథులు జాతీయ పతాకంతో పాటు బాక్సింగ్ ఫెడరేషన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత బాక్సింగ్ రింగ్‌లో పంచ్‌లు వేసి జాతీయ స్థాయి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. దీంతో జేపీఎన్సీ ప్రాంగణం క్రీడా సందడితో మార్మోగింది.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన బాక్సర్లు పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు సిద్ధమయ్యారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో హోరాహోరీ పోరు సాగనుంది. ఈ కార్యక్రమంలో జాతీయ బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి రాకేశ్ భరద్వాజ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రఘువీర్ సింగ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, జేపీఎన్సీ చైర్మన్ కేఎస్ రవికుమార్, మహబూబ్‌నగర్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజు గౌడ్, కళాశాల అధ్యాపకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మానవత్వమే మార్గంగా.. ప్రజాసేవే లక్ష్యంగా

## -పేదల వైద్యానికి అండగా బెక్కెం వేణుగోపాల్‌రెడ్డి

## -సీఎం సహాయనిధి ద్వారా పలువురికి ఆర్థిక సాయం.. నిమ్స్‌లో మెరుగైన వైద్యం కోసం కృషి

**చిన్నంబావి,అక్టోబర్ 8 (ప్రజాజ్యోతి)**

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందక సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పించడం తన బాధ్యతగా భావిస్తూ బెక్కెం వేణుగోపాల్‌రెడ్డి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. చిన్నంబావి మండలం వెల్లటూర్ గ్రామానికి చెందిన ఆయన ప్రజా సమస్యలపై స్పందిస్తూ, తన పరిధిలో సాధ్యమైనంత సహాయం అందించేందుకు కృషి చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ, మెరుగైన వైద్యం కోసం అవసరమైన సహకారం అందిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా, పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్న బెక్కెం వేణుగోపాల్‌రెడ్డి తనకు ఉన్న పరిచయాలను ఉపయోగించుకుంటూ అవసరమైన వారికి వైద్య సహాయం అందేలా కృషి చేస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఆసుపత్రి ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా ఎల్‌ఓసీలు మంజూరు చేయించడంలో చొరవ చూపుతున్నారు.బుక్కాపురం మద్దిలేటికి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ చిన్నంబావి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన బుక్కాపురం మద్దిలేటి కొంతకాలంగా మెదడు, నరాల సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. కర్నూలుతో పాటు పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా వ్యాధి తగ్గకపోవడంతో పాటు కుటుంబంపై ఆర్థిక భారం పడింది. ఈ విషయం వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి రావడంతో వెంటనే స్పందించారు. నిమ్స్ వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. సీఎం సహాయనిధి ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరయ్యేలా కృషి చేశారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి మద్దిలేటిని పరామర్శించారు. ఈ సందర్భంగా మద్దిలేటి కుటుంబ సభ్యులు ఆయనకు, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.గోవిందమ్మకు రూ.2 లక్షల సాయం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం చుక్కాయిపల్లి గ్రామానికి చెందిన గోవిందమ్మ (భర్త వెంకటస్వామి) మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని తెలుసుకున్న వేణుగోపాల్‌రెడ్డి సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరయ్యేలా కృషి చేశారు. ఎం.రాజుకు రూ.2.50 లక్షల ఆర్థిక సాయం మేడ్చల్ జిల్లా కాప్రా, కుషాయిగూడకు చెందిన ఎం.రాజు వెన్నెముక, తీవ్ర నరాల సమస్యతో బాధపడుతూ పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఇప్పటికే వైద్య ఖర్చులతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో కుటుంబ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డిని ఆశ్రయించారు. స్పందించిన ఆయన సీఎం సహాయనిధి ద్వారా రూ.2.50 లక్షల ఆర్థిక సాయం అందేలా కృషిచేశారు.అంతేకాకుండా నిమ్స్ వైద్య బృందంతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యం అందేలా సహకరించారు.ఆపదలో ఉన్నవారికి సమయానికి సహాయం అందించడంతో పాటు వైద్య అవసరాల కోసం ప్రభుత్వ పథకాలను





సద్వినియోగం చేసుకునేలా తోడ్పాటు అందించడం ద్వారా వేణుగోపాల్‌రెడ్డి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నిరుపేదలకు వైద్యం అందేలా మరింతగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

---

# వైకల్యంగల పిల్లల పట్ల వివక్ష చూపరాదు

## - న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ నిహారిక

**నాగర్ కర్నూల్ : అక్టోబర్ 08 (ప్రజా జ్యోతి)**

రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ నిహారిక గురువారం మెంటల్ హెల్త్ డే ను పురస్కరించుకొని నాగర్ కర్నూల్ పట్టణంలోని డెఫ్ అండ్ డంబ్ పిల్లలున్న భవిత విలీనవిద్య వనరుల కేంద్రం పాఠశాలలో ప్రభుత్వఆసుపత్రి ఆధ్వర్యంలో చిన్నారుల మెడికల్ క్యాంప్ నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులకు ఈ ఎన్.టి డాక్టర్ భరద్వాజ,సైకియాట్రిస్ట్ అంబుజా,పీడియాట్రిసియన్ డాక్టర్ ఉదయ్ కుమార్ ల చేత చిన్నారులకు వైద్య పరీక్షలను సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిహారిక ఆధ్వర్యంలో నిర్వహించి చిన్నారులకు కావలసిన మందులను ఉచితంగా అందించారు.అనంతరం నిహారిక మాట్లాడుతు సమాజంలో వైకల్యం గల పిల్లల పట్ల వివక్ష చూపరాదని వారికి ప్రత్యేక వసతులు కల్పించి వారిని అందరితో సమానంగా చూడాలని నేటి తరం యువత ఎంతోమంది శారీరక,మానసిక సమస్యలతో బాధపడుతున్నారు,ఎవ్వరు అధైర్య పడవద్దని అన్నారు.కార్యక్రమంలో డాక్టర్లు భరద్వాజ,అంబుజా,ఉదయ్ కుమార్,పాఠశాల నిర్వాహకుడు ప్రకాష్,చిన్నారులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.



---

# అక్రమ ఇసుక టిప్పర్ సీజ్

**మాగనూరు,అక్టోబర్ 08(ప్రజా జ్యోతి)**

ఓబ్లాపూర్ గేటు వద్ద గురువారం తెల్లవారుజామున పోలీసులు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. పెట్రోలింగ్‌లో ఉన్న ఏఎస్ఐ మన్నన్, కానిస్టేబుల్ బి. శివకుమార్ టిప్పర్ (౨+ 38 ౨ 2718)ను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు.డ్రైవర్‌ను ఉట్కూర్ మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన ఎడవెల్లి హన్మంతు (32)గా గుర్తించారు. టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పి. అశోక్ బాబు తెలిపారు...




---

# పెద్దవార్వాల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**గండీడ్ ప్రజా జ్యోతి:**

గ్రామంలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ జంగం వీరన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, దిగంబర్ రావు, డీలర్ అంజలయ్య, నల్ల దస్తయ్య, బాయికాడి రవి, ఎంకేపల్లి భీమయ్య, ఆశా వర్కర్ కావలి తిరుపతమ్మ, సత్యసాయి భజన మండలి కన్వీనర్ కయ్య రాఘవేందర్, అయినపురం కృష్ణయ్య, నీరటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.కంటి వైద్య శిబిరానికి వచ్చిన వైద్యులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు గ్రామ సర్పంచ్ జంగం వీరన్న మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి సభ్యులు సర్పంచ్ జంగం వీరన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# జిల్లా అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకం

## - ప్రజల ఆర్థిక ప్రగతికి విస్తృతంగా రుణాలు అందించాలి

## - బ్యాంకులు,ప్రభుత్వ శాఖల సమన్వయంతో రుణ లక్ష్యాలను సాధించాలి

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్




**నాగర్ కర్నూల్ : అక్టోబర్ 08(ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా ప్రజల ఆర్థిక ప్రగతికి,పేదలు, ఔత్సాహికులకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి బ్యాంకులు విస్తృతంగా రుణాలు అందించి జిల్లా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అన్నారు.గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ హాల్లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మొదటి త్రైమాసిక డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ (డీసీసీ) బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలో బ్యాంకుల ద్వారా అమలు చేస్తున్న రుణపథకాలు,నిర్దేశితలక్ష్యాల సాధన,వివిధ ప్రభుత్వ పథకాలక రుణాల మంజూరు ఇతర అంశాలపై శాఖలవారీగా,బ్యాంకర్లు అందించిన వ్యవసాయ అనుబంధరంగాలు,మహిళల,ఒత్సాహిక రుణాల మంజూరు, సాధించిన లక్ష్యాల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి బ్యాంకులవారిగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ,ఆర్థికాభివృద్ధి పథకాలకనుగుణంగా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణ సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు ఎం.ఎస్.ఎం.ఈ రుణాలు,పీఎంసూర్య ఘర్ పథకం, వ్యవసాయ రుణాలు,ఇన్వెస్ట్‌మెంట్ క్రెడిట్ రుణాల మంజూరును మరింత పెంచాలని బ్యాంక్ అధికారులకు సూచించారు.బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను నిర్ణీత గడువు లోగా సాధించేలా ప్రత్యేకదృష్టి సారించాలని,సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తున్న పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయాలని,రుణాల మంజూరులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు,బ్యాంకర్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని,విద్యార్థులకు విద్యారుణాల పట్ల విస్తృత అవగాహన కల్పించి ఉన్నత విద్యను అభ్యసించేందుకు రుణ సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని, వ్యవసాయ రుణాల మంజూరు,రెన్యువల్ సమయంలో రీసర్వే కారణంగా సమస్యలు తలెత్తితే,రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు.ఏజెన్సీ ప్రాంతాల్లో ఆధార్ సేవలు అందుబాటులో లేకపోవడంవల్ల గిరిజనప్రజలు ఎదుర్కొంటున్న స మస్యలను దృష్టిలోఉంచుకుని,సంబంధిత బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని,ప్రజలకు సమీప ప్రాంతాల్లోనే ఆధార్ సేవలు అందేలా అవసరమైన సిబ్బంది,సాంకేతిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేటందుకు ఆధార్ సేవలు కీలకమని,ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలోని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఆధార్ కేంద్రాల ఏర్పాటుతో ప్రజల సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు ఆధార్ సేవలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. బ్యాంకులు,ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశించిన రుణలక్ష్యాలను సాధించాలని,అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల కింద రుణాలందేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని,ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాల అమలులో బ్యాంకుల పాత్ర కీలకమని కలెక్టర్ అన్నారు.సమావేశంలో డి.ఆర్.ఓపాండు,యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్, డీసీసీ/డీఎల్ఆర్సీ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు,లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్,ఆర్బీఐ మేనేజర్ ప్రదీప్ చంద్ర నాయక్, నాబార్డ్ అధికారి చందు,వివిధ బ్యాంకు మేనేజర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నేరేడుగాంలో అగ్నిప్రమాదం..

## నగదు, పత్రాలు దగ్ధం

**మాగనూర్, అక్టోబర్08(ప్రజా జ్యోతి)**

నేరేడుగాం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో అక్టోబర్ 6న తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రూ.48 వేల నగదుతో పాటు మక్తల్ ప్లాట్ల పత్రాలు, ముంబైలోని ఐదు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఎల్ఐసీ బాండ్లు, పిల్లల ధ్రువీకరణ పత్రాలు, బైక్ ఆర్సీ దగ్ధమయ్యాయి.రైతు షేకసింది వెంకట్రాములు కుటుంబంతో ముంబై వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు మంటలను అదుపు చేశారు. టీవీ, ఫ్రిజ్, కూలర్ తదితర గృహోపకరణాలు కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని బాధితుడు ఫిర్యాదు చేయగా, మాగనూర్ పోలీసులు క్రైమ్ నంబర్ 175/2026 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ బాబు తెలిపారు.





# ఓబ్లాపూర్ గేటు వద్ద బైక్ స్కిడ్..

## మహిళ మృతి

**మాగనూర్, అక్టోబర్ 08(ప్రజా జ్యోతి)**

మాగనూర్ మండల్ ఓబ్లాపూర్ గేటు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడెబల్లూర్‌కు చెందిన రాయిచూర్ లక్ష్మి (46) మృతి చెందింది. భర్త లక్ష్మణతో కలిసి మఖ్తల్‌కు కూలి పనికి వెళ్లి తిరిగి వస్తుండగా కుక్క అడ్డం రావడంతో బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది.ఈ ప్రమాదంలో లక్ష్మికి తలకు తీవ్ర గాయాలు కావడంతో మఖ్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు మాగనూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.